క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు సమర్పిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఎరిగేరి గ్రామానికి చెందిన 16 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను బుధవారం ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తాకు అందజేశారు. చంద్రబాబు కుట్రలతో ఎన్నికల విధులకు, పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచడంతో మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

24 లోపు ఫీజు చెల్లించండి

కౌతాళం: ఫెయిల్ అయిన ఇంటర్మీడియెట్ విద్యార్థులు, ఇంప్రూవ్‌మెంట్ కోసం పరీక్ష రాయాలనుకుంటే ఈ నెల 24 లోపు ఫీజు చెల్లించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు కళాశాలలో స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంటింటా ప్రచారం



కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: మండల కేంద్రంలోని బస్టాండ్ వెనుక భాగం, బీరప్ప కాలనీ, శ్రీరామ టాకీస్ కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతాప్ నాయుడు, జంపాపురం బసవరాజు, బండ్ల గోవిందు, బెంగి వీరేష్, కోడిముక్కల గోపాల్, ఆనంద్, గ్యాంగ్ ఈరన్న, అంజినయ్య తదితరులు ఇంటింటికి తిరిగి బాలనాగిరెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని, అందుకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డిని, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించుకోవాలన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

ఆదోని అర్బన్: అగ్ని ప్రమాదాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆదోని అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జ్, జిల్లా సహాయాధికారి రామాంజనేయులు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని కొత్త బ్రిడ్జి వద్ద పెట్రోల్ బంకు సిబ్బందికి అగ్ని ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. పెట్రోల్ లీకై మంటలు చెలరేగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలు ఆర్పే విధానాన్ని డెమో ద్వారా చూపించారు. అనంతరం సూచనలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, మల్లికార్జున రెడ్డి, సందీప్‌కుమార్, చాంద్‌బాషా, హనీఫ్, రఘు పాల్గొన్నారు.

మొబైల్ షాపులో చోరీ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోనున్న శ్రీనివాస మొబైల్ దుకాణంలో బుధవారం వేకువజామున చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాస్ మొబైల్ షాప్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి యథావిధిగా తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం షాపు తెరిచేందుకు రాగా తాళాలు పగులగొట్టబడి ఉండటాన్ని గుర్తించాడు. షాపు తెరచి లోపలికి వెళ్లి చూస్తే క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.1.50 లక్షల నగదు, ఐఫోన్ చోరీకి గురైందని నిర్ధారించుకున్నాడు. స్థానిక టూటౌన్ పోలీసులకు సమాచారం అందించటంతో వారు ఘటనా స్థలికి చేరుకుని సీసీ కెమెరాల పుటేజిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ రాజారెడ్డి తెలిపారు.

కారును ఆపి బెదిరించిన దుండగులు

మహానంది: నంద్యాల నుంచి మహానందివైపు కారులో వెళ్తున్న ప్రయాణికులను తమ్మడపల్లె మలుపు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు బెదిరించిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కారులో వస్తున్న వారిని గంగమ్మ గుడి సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద ఆపి బెదిరించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పలువురిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

నేడు రాతి దూలం లాగుడు పోటీలు

డోన్ టౌన్: గోసానిపల్లెలో శ్రీరామనవమిని పురస్కరించుకొని గురువారం న్యూ క్యాటగిరి ఎద్దులకు రాతి దూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.45 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి రాతి దూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన వృషభాల యాజమానులకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున అందజేస్తామన్నారు.

అంతా రామమయం..!

- భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. భక్తులు ఉదయమే పుణ్యస్నానాలాచరించి, పిండి వంటలు చేసుకుని ఆలయాలకు చేరుకుని స్వాముల వారికి నైవేద్యంగా సమర్పించారు. శ్రీరాముడికి ఇష్టమైన పానకం చేసి భక్తులకు పంచిపెట్టారు. శ్రీరామ జపాన్ని పఠించారు. శ్రీరామ.. జయ రామ.. జయ జయ రామ అంటూ భజనలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీ సీతారామ లక్ష్మణ హనుమాన్

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. విక్టోరియాపేటలోని కోదండ రామాలయంలో సీతారామ ఆంజనేయస్వామి వార్లకు ఫల పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, వెండి, పూల అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పల్లకీసేవ, రథోత్సవం నిర్వహించారు. ఇందిరానగర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ, మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలోనూ, కోట వీరభద్రేశ్వరస్వామి వద్ద సీతారామనగర్‌లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి సీతారాముల కల్యాణం నిర్వహించారు.



విక్టోరియాపేటలో పల్లకీసేవలో స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న దృశ్యం

కోసిగి మండలంలో..

కోసిగి: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో వెలసిన శ్రీరామాలయంలో ఆలయ ధర్మకర్తలు శ్రీరాములు, సీతా దంపతులచే వేకువ జామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, మహామంగళ హారుతు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆదోనికి చెందిన వేదపండితులు సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు స్వామి వారికి టెంకాయలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే రంగప్ప గట్టు సమీపంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు ఏర్పాటు చేశారు.



కోసిగిలో పూజలందుకున్న సీతారాముల వారు



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం



రాజనగర్ క్యాంపులో పూజల్లో పాల్గొన్న భక్తులు



పూజలందుకుంటున్న సీతారాములు



కౌతాళంలో పూజల్లో పాల్గొన్న వేద పండితులు

కౌతాళం మండలంలో..

కౌతాళం: శ్రీరామనవమి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. రాజానగర్, కుంబళనూరు క్యాంపుల్లో నిర్వహించిన వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సీతారాములకు ఉదయం సుప్రభాతసేవ, గంధపుసేవ, పాలభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల కోలహలం మధ్య సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులకు క్యాంపు వాసులు అన్నదానం ఏర్పాటు చేశారు. కౌతాళంలోని త్రంబకేశ్వరస్వామి ఆలయంలో వేదపండితుల సమక్షంలో శ్రీరామనవమి వేడుకలను నిర్వహించి కల్యాణోత్సవాన్ని చేపట్టారు.



పెద్దకడబూరు మండలం మేకడోణ గ్రామంలో నవమి వేడుకల్లో కలశాలతో పాల్గొన్న చిన్నారులు

పెద్దకడబూరు మండలంలో..

పెద్దకడబూరు: మండల కేంద్రంతో పాటు మేకడోణ, రంగాపురం, హులికన్వి, గంగులపాడు, నాగులాపురం, పెద్దకడబూరు, తారాపురం, బసలదొడ్డి తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆయా ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు కనుల విందుగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలో రామలక్ష్మణ్ ఆలయం నుంచి ప్రభోత్సవం నిర్వహించి స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వరకు చేపట్టి తిరిగి యథాస్థానానికి చేర్చారు. మేకడోణలో పల్లకీసేవ ఉత్సవం ముందు కలశాలతో చిన్నారులు అలరించారు. కాగా హెచ్.మురవణి గ్రామంలోని సీతారాముల రథోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు అర్చకులు సత్యనారాయణస్వామి, మూర్తి స్వామి తెలిపారు.



పెద్దకడబూరులో పూజలందుకుంటున్న శ్రీసీతారాములు



కుంబళనూరు క్యాంపులో పూజలు చేస్తున్న అర్చకుడు

రేపు బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో శుక్రవారం ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు చెన్నారెడ్డి తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో పాలపళ్ల విభాగంలో పోటీలు జరుగుతాయని చెప్పారు. తొలి 10 స్థానాల్లో నిలిచే వారికి వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.4 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9573442294, 9704383745 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన ఎస్పీ



ఆలూరు స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

ఆలూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అల్లర్లకు పాల్పడే వారిపై పోలీసు యంత్రాంగం ప్రత్యేక నిఘా ఉంచి ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. ఆయన బుధవారం ఆదోని, ఆలూరు నియోజకవర్గాల పరిధిలోని ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ఈవీఎంలను ఉంచిన గదులు, భద్రత, సీసీ కెమెరాలు, పోలీసు సిబ్బంది పనితీరు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీసు శాఖ కృషి చేయాలన్నారు. నేరచరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అసాంఘిక కార్యకలాపాలను అణచివేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రామునాయక్, తహసీల్దార్ చంద్రశేఖరయ్య, సీఐ బి.వెంకటేశ్వర్లు, డీటీ రజనీకాంత్‌రెడ్డి, ఎలక్షన్ డీటీ గుండాలనాయక్, అసిస్టెంట్ డీటీ బసన్నగౌడు, రెవెన్యూ సిబ్బంది, ఎస్‌ఐ ఓబులేసు తదితరులు ఉన్నారు.

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఎమ్మిగనూరురూరల్: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నానామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిబంధనలను అతిక్రమించరాదన్నారు. నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచుతామని తెలిపారు. డీఎస్పీ సీతారామయ్య, టౌన్, రూరల్ సీఐలు మధుసూదన్‌రావు, మోహన్‌రెడ్డి, ఎస్‌ఐలు రమేష్‌బాబు, శ రత్‌కుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పార్థసారథికి ఓటుతో బుద్ధి చెప్పండి

- చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన వ్యక్తి ఇక్కడ పెత్తనమేంటి
- కూటమి కుట్రలను తిప్పి కొట్టండి
- ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి పార్థసారథికి ఓటుతో బుద్ధి చెప్పాలని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని ఆరేకల్, నెట్టేకల్ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రచారరథంపై నుంచి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఆయా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చిత్తూరు జిల్లాకు చెందిన పార్థసారథి ఇక్కడికి వచ్చి పెత్తనం చెలాయించాలని చూస్తున్నాడన్నారు. కూటమి కుట్రలకు తిప్పి కొట్టి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. తనను తిడితే ఓట్లు పడతాయనే భ్రమలో పార్థసారథి ఉన్నారన్నారు. తాను ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 20 ఏళ్లుగా ప్రజల్లో ఉంటూ రాజకీయం చేస్తున్నానన్నారు. ఇక్కడి ప్రజలు తెలివైన వారని, ప్రజలకు ఎవరు మేలు చేస్తే వారిని గెలిపించుకుంటారన్నారు. ఐదేళ్ల పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వంద శాతం హామీలను నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నే ముఖ్యమంత్రి కావాలన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే మరోసారి గెలిపించుకుందామన్నారు. ప్రజల అభిమానం చూస్తుంటే తాను ఈ సారి భారీ మెజార్టీతో గెలవబోతున్నానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్, ఆరేకల్ సర్పంచ్ లోహితప్రియ వీరస్వామి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, నెట్టేకల్ సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీటీసీ సంజీవరెడ్డి, నాయకులు ప్రతాపరెడ్డి, రామకోటిరెడ్డి, వెంకోబ, మాజీ సర్పంచ్ వీరారెడ్డి, నరసింహులు, చిన్నగొట్టయ్య పాల్గొన్నారు.

వేడుకగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న వై.ప్రదీప్‌రెడ్డి తదితరులు

పెద్దకడబూరు: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఉదయం గ్రామ పెద్దలు, బీఆర్ అంబేడ్కర్ కమిటీ సభ్యులు, యూత్ ఎమ్మిగనూరు ప్రధాన రహదారిలోని నాలుగవ మైలురాయి వద్ద నుంచి బైకు ర్యాలీ చేపట్టారు. అనంతరం దళిత నాయకుడు ఆనందరాజు అధ్యక్షతన రిటైర్డ్ ప్రిన్సిపాల్ లూర్దయ్య అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దస్తగిరి, వైఎస్సార్ సీపీ యూత్ కమిటీ రాష్ట్ర సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి(విగ్రహ దాత) పురుషోత్తంరెడ్డి, ఎఫ్‌డీసీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆల్‌ఫ్రెడ్ రాజు, కేవీపీఎస్ జిలా అధ్యక్షుడు దేవసహాయం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌చైతన్య, అంబేడ్కర్ భవన సాధన కమిటీ కదిరికోట ఆదెన్న, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కనకవీడు రాజు, ఉప సర్పంచ్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టికెట్ ఇవ్వనందుకు పార్టీ మారి నిందలా?



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న బుట్టా రంగయ్య, నక్కలమిట్ట శ్రీనివాసులు

ఎమ్మిగనూరుటౌన్: ఎంపీ/ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడంతో గుర్తింపునిచ్చిన పార్టీని వదిలి టీడీపీలో చేరి ఇప్పుడు నిందలు వేస్తున్నావా సంజీవా అని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టా రంగయ్య, బీసీ సంఘం జాతీయ నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కర్నూలు ఎంపీ సంజీవకుమార్‌కు పార్టీ టికెట్ ఇవ్వలేదన్న అక్కసుతో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి, ఎంపీ పదవికి మాత్రం స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేయకుండా డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ పంచన చేరి రాజకీయ భవిష్యత్తునిచ్చిన వైఎస్సార్‌సీపీపై తప్పుడు ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. ఎంపీగా ఐదేళ్లు కొనసాగిన సంజీవ్‌కుమార్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి పనులకు ఎంతమేర సహకరించారో ఆయనకే తెలియాలన్నారు. పట్టణంలో కుర్ని, కురువ, బోయ కల్యాణ మండపాల కోసం రూ.కోటి ఎంపీ నిధుల కోసం ప్రతిపాదనలు పంపితే 8 శాతం పర్సెంటేజీ దండుకున్న నీచ సంస్కృతి ఆయనదని ధ్వజమెత్తారు. అలాంటి వ్యక్తి ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన ఆయన సలహాలను అభ్యర్థి బుట్టా రేణుక తీసుకోవడాన్ని వక్రీకరించడం తగదన్నారు. గతంలో ఎంపీగా బుట్టా రేణుక తన నిధులతో ఎంతో అభివృద్ధి చేశారని, సంజీవ్‌కుమార్ చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. రాష్ట్ర శాప్ నెట్‌వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, పద్మశాలి సంఘ అధ్యక్షుడు విశ్వనాథ్ రమేష్, కౌన్సిలర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి



బొల్లెద్దుల ఏసేపు(ఫైల్)

పగిద్యాల: మండల పరిధిలోని పాత ముచ్చుమర్రిలో ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లిన ఓ కూలీ వడదెబ్బ బారినపడి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొల్లెద్దుల ఏసేపు(41) ఉపాధి హామీ పథకం కింద పంట కాలువల్లో పూడిక తీత పనులు చేసేందుకు వెళ్లాడు. బుధవారం ఉదయం పని ప్రదేశంలోనే స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు విడిచాడు. మృతునికి భార్య సుజాత, హేమంత్, సుధీర్, చినబాబు పిల్లలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి హుటాహుటినా పాత ముచ్చుమర్రికి చేరుకుని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

నేటి నుంచి చౌడేశ్వరీ తిరునాల



చౌడేశ్వరీమాత

బేతంచెర్ల : పట్టణ సమీపాన కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరీ మాత తిరునాల ఉత్సవాలు గురువారం రాత్రి నుంచి ప్రారంభం అవుతాయని నిర్వాహకులు గౌరిహుసేన్ రెడ్డి తెలిపారు. 18 నుంచి 21వ తేదీ వరకు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

21న బండలాగుడు పోటీలు

చౌడేశ్వరీ తిరునాల సందర్భంగా 21న రాష్ట్ర స్థాయి ఆరు, ఆరుపండ్లలోపు వృషభాలకు బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు గౌరిహుసేన్‌రెడ్డి తెలిపారు. విజేత వృషభాల యాజమానులకు రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ. 10 వేలు చొప్పున బహుమతులు అందజేస్తాన్నారు. వివరాలకు 9440463977, 9440773232 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అనాథ శవానికి అంతక్రియలు

కోసిగి: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని 50 ఏళ్ల వ్యక్తి బుధవారం మృతి చెందాడు. కొంతకాలంగా భిక్షాటన చేసుకుంటూ ఇక్కడే జీవించేవాడని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.